16-11-51

కళామందిరం తయారుకాదు సరికదా, జాతీయోద్యమంలోని శక్తులన్నీ సహకరించి అందులో జాతీయత ప్రతిబింబించేటందుకు కూడా కృషి జరగాలి. ఆంధ్ర శిల్పంలోనూ, నాటకకళలోనూ, నాట్యకళలోనూ, చిత్రకళలోనూ గల ఉత్తమ సంప్రదాయాలు అందులో ప్రతిబింబించాలి.

ఆంధ్ర నాటక కళాపరిషత్తు కళామందిర నిర్మాణానికిగాను చేస్తున్న కృషి ఆంధ్రుల నీరస స్థితిని మాత్రమే వ్యక్తం చేస్తోంది. దేశం స్వతంత్రమైన తరవాత కూడా ఆంధ్ర కాంగ్రెసు మహానాయకులు పదవీవ్యామోహం, పర్మిట్ల వ్యామోహం ప్రదర్శించినట్టుగా సంస్కృతీ వ్యామోహం ప్రదర్శించలేదు. రెండవ ప్రపంచ యుద్ధం అయిపోయిన అనంతరం కమ్యూనిస్టు పార్టీ అయోమయంలో పడిపోయేదాకా తెలుగు కళలలో నవచైతన్యం ప్రవేశపెట్టటానికిగాను చేసిన కృషి యావత్తూ కమ్యూనిస్టులే సాగించారు. "దేశభక్తులు" వారితో కనీసం పోటీ అయినా చెయ్యలేదు. ఇవాళ ఆంధ్ర రాష్ట్రోద్యమంతో ఆంధ్రజాతీయావేశం తిరిగి తలయెత్తింది. సంస్కృతి ఒక రాజకీయ పక్షంవారి సొత్తు కాదు. ఇప్పటికైనా ఆంధ్ర సంస్కృతీ కళాభిమానులంతా కలిసి ఆంధ్రనాటక కళాపరిషత్తు ద్వారాగాని మరొక విధంగాగాని ఆంధ్రప్రజల ఆదర్శాలకు సంస్కృతీ చిహ్నంగా ఉండేటట్టు విశిష్ట జాతీయ కళామందిరం ఏర్పరచటం చాలా అవసరం.

స్కెచ్

# పెళ్ళి తరువాత జీవితం

సుంకర లక్ష్మీనారాయణ

రాత్రి పదకొండు గంటలు కావొస్తూంది.

బయట యింకా జోరున వర్షం కురుస్తూనే వుంది. నిన్న ఉదయం మొదలుపెట్టిన వాన ఇంకా తగ్గకపోవడం సత్యానికి యేమీ బాగాలేదు. రేడియోలో విన్నాడు బంగాళాఖాతంలో సుడిగుండం లేచినట్టు. దాని దెబ్బ ఇది. వానతోపాటు హోరున చలిగాలి. సత్యానికి నిద్ర పట్టడం లేదు. కిటికీ తలుపులు రెండూ పూర్తిగా తీసి ఉండడం వలన గాలి లోపలికి కొడుతూంది. దానివల్ల ఆ ఉన్న కాస్త దీపం ఆరిపోతుందేమోనని భయం. పోనీ లేచివెళ్ళి కిటికీతలుపులు మూసివద్దామా అంటే బద్ధకం. తన్ని పెట్టిన ముసుగు మాత్రం తీయకుండానే ప్రక్కజేబులోంచి ఒక బీడీ, అగ్గిపెట్టె తీశాడు. బీడీ నోట్లో పెట్టి రెండుమూడు అగ్గిపుల్లలు గీశాడు గాని, గాలివల్ల అవి ఆరిపోయినయ్. చివరికి విసుగెత్తి బీడీ జేబులో పెట్టాడు. తన మంచానికి కొంచెం దూరంలో పడుకొన్న తన భార్యని లేపి కిటికీ తలుపులు వెయ్యమని చెబుదామనుకొన్నాడు, కాని నిద్రపోతున్న దాన్ని ప్రత్యేకంగా పని కట్టుకొని లేపి ఆ పని చెప్పడమేమంత వివేకం కాదనుకొన్నాడు. కాదుమరీ. తీరా లేపాక – ఆ పని కూడా నేనే చెయ్యాలా అన్నదంటే చచ్చినంత పని. ఎందుకనదూ? రోజూ అంటున్న మాటలన్నీ? నిన్న మధ్యాహ్నం రెండుగంటలదాకా కామేశ్వరరావు రూమ్‌లో బాతాకాని కొట్టికొట్టి యింటికి పోతే "పనీ పాటా లేకపోయినా ఊళ్ళో పెత్తనాలు" అంటే తనేమనగలిగాడు? ఔను మరి! పనీ పాటా లేనపుడు కాస్త ఒళ్ళు దగ్గర పెట్టుకొని మసలక్కరలేదూ? అయినా ఇప్పుడు ఆడవాళ్ళు చాలా ముదిరిపోయారు. నానా అవస్థలూ పడి తెచ్చిపడేస్తేనే మొగుడుగాని.... లేకపోతే...? కాని, తనదే తప్పు తొందరపడి పెళ్ళి చేసుకోవడం. అయినా పెళ్ళి అంటే ఇలా వుంటుందని అనుకోలేదు సుమా! తనకెంతో విధేయురాలై తను చెప్పినపనల్లా

చేస్తూ ఎంతో చక్కగా వుంటుందనుకొన్నాడు. గాని ఇలా ఎదురు తిరిగి తనకే పంగనామాలు పెడుతుందనుకోలేదు. ఇదివరకటిలాగ సందులు గొందులు సినిమాహాలు దగ్గర ఆడవాళ్ళ గేట్లు కాపలా కాయనక్కర లేదూ, తనకి ఒక భార్య అంటూ యింట్లోనే వుంటుంది గదా అనుకొన్నాడు గాని ... ఇదంతా యెందుకొచ్చిందంటే తనేమీ సంపాదనాపరుడు కాకపోవడం, తను ఇద్దరు బిడ్డల తండ్రిఅయినా, ఆ ముసలి తండ్రి సంపాదనమీదే ఆధారపడి సకుటుంబ సమేతంగా మేయడం తన భార్యకేమీ నచ్చలేదు. అందులోనూ తండ్రి ప్రతి రోజూ నానా తిట్లూ తిట్టడమే నాయె. భార్యముందు అలా తిట్టడం యెంత లోకువ? అయినా తప్పుమాత్రం తన తండ్రిదేనని గట్టిగా చెప్పగలడు. ఎదిగిన పిల్లలని యెలా పడితే అలా పెళ్ళిచేసి పారెయ్యడానికే చూస్తారుగాని వాడికి పెళ్ళిచేస్తే బ్రతకగలడా? బ్రతకలేడా! అనే ఆలోచనే వుండదూ! నిన్నగాక మొన్నటివరకూ తన అమ్మ చెంగున కట్టుకొన్న డబ్బులు విప్పుకొని సినిమాకి పారిపోయేవాడు. అటువంటి తనకో భార్యనీ యిద్దరు పిల్లలనీ ఇచ్చి "బతకండ్రా" అంటే యెలా బ్రతకడం? పోనీ ఏదైనా గుమాస్తాగిరీ ఏడుద్దామా అంటే కాపీకొట్టి పేసయిన స్కూలు ఫైనలు ఇంగ్లీషంతా మర్చిపోయాడు. మొదటి అచ్చు ఏదో మూడో అచ్చు ఏదో తనకే తెలియదాయిరి. అటువంటప్పుడు యెలా చావడం? తండ్రి మట్టుకి తండ్రి "ఇంత పెద్దవాడివైనావ్. యింకా బుద్ధి రాకపోతే యెలారా బ్రతకడం. నిన్ను పోషించడమే గాకుండా నీ పెళ్ళాన్ని పిల్లలని గూడానా! యిక నాచేతకాదు బాబూ, నీ దారి నువ్వు చూసుకోవలసిందే?" అనలేదా? యేం దారి? గోదారి.

పెళ్ళి చేసుకోవడం అంత బుద్ధితక్కువ ఇంకోటి లేదని, డప్పుమీద దెబ్బకొట్టి చెబుతాను. అంటే, సంపాదించటం నాలాగ చేతకాని వాడు. పెళ్ళి చేసుకోక ముందు యెలా వుండేవాణ్ణి! నేను వెళ్ళినట్టు సినిమాలకి యెవడైనా వెళ్ళాడా! ఏ వేళకొచ్చినా యింత కూడు పడేసేవారు. హాయిగా ఊళ్లో బాతాకానీ కొట్టుకుంటూ ఉండేవాణ్ణి. ఎటొచ్చి యీ రెండేళ్ళ బట్టేగా ఈ గొడవంతా! ప్రపంచమే యిలావుంది మరి. ఏ గవర్నమెంటు అయినా "డబ్బు" అనేదాన్ని తీసిపారేస్తే తీరిపోను! ఏ తిప్పలువచ్చినా యీ డబ్బుదగ్గరే వస్తాయి. తెల్లారితే యెవడి మొఖం చూసినా "డబ్బు" అన్నమాటలేగాని ఇంకో ఊసుఎత్తడు. ఇప్పుడు తను డబ్బు సంపాదించాలంటే మాటలా. తిండి ఖర్చుల దగ్గరనుంచి, పెళ్ళానికి కోకలు జాకెట్లవరకూ, తనకి సాదర ఖర్చుల దగ్గరనుంచి పిల్లల బట్టలు చిరుదిండ్లవరకూ సంపాదించాలి. తీరా యీ ఆలోచన. యిప్పుడు పుట్టిందిగాని ఇంతకు ముందు ఎప్పుడో వుంటే బాగుపడేపోను.

తను పెళ్ళి రోజున చూసిన తన భార్యేనా యీమె? ఆ సిగ్గు, ఆ వినయం అవన్నీ యేమైనాయ్? ఇంతలోకే భార్య ప్రక్కలో వున్న చంటిపిల్ల లేచి ఏడ్చింది. యింకా వర్షం కురుస్తూనేవుంది. దానితోపాటు గాలికూడా ఎక్కువైంది. ఈసారి వీచిన గాలితో ఉన్న దీపం కాస్తా ఆరిపోయింది. గదంతా చీకటి. "ఏమండీ" అంది భార్య విసుగ్గా. ఇంతవరకూ తను ఊహిస్తూన్న ఊహంతా ఎగిరిపోయింది. "ఆ..." అన్నాడు మేల్కొనే ఉన్నాను అన్నట్టు. "చూడండీ, దీపం ఆరిపోయింది. చమురు అయిపోయిందేమో చూసి కాస్త వెలిగించిపెట్టండి. చంటిపిల్ల వున్నయిల్లు. ఆ కిటికీ తలుపులు గూడా గట్టిగా బిగించిరండి" అంటూ పురమాయించింది. చచ్చినట్టు చేయాల్సి వచ్చింది. ఎవడికోసం! చేసుకొన్నందుకు, పిల్లల్ని కన్నందుకూనూ! బుడ్డిలో నూనెపోసి దీపం వెలిగించి కిటికీ తలుపులు బిగించి వచ్చి పడుకొన్నాడు సత్యం.

కష్టకాలంలో భార్య అవసరం ఎంత అమూల్యమో అవివాహితుడికి తెలియదు. ఎంచేతంటే అవివాహితుడికి అటువంటి కష్టాలు అసలు రానేరావు.